# 'మా గృహిణి'

శ్రీమతి వట్టి శేషాంబగారు

'రాజ్యం!'

'ఆ!'

'ఏమి చేస్తున్నావు?'

'నూలు వడుకుతున్నాను' అంటూ కాగపుబూంది మంచినీళ్లుతెచ్చి మేజామీద పెట్టింది రాజ్యలక్ష్మి నవ్వుతూ. నీలంవన్నె ఖద్దరుచీరె, కాఫీకలరులతలతో విరిసిన ఖద్దరుజాకెట్టు, ముఖమున అరుణరేఖలుతీర్చి దిద్దిన కుంకుమబొట్టు అయిదవమాసం గర్భము మారాజ్యంకు వింత చెలువునిచ్చాయి. ఆమె సర్వాంగసౌష్టవాన్ని విలోకిస్తూ అడిగాను—

'అయితే మా కాఫీటీలకిక నీళ్లు వదులుకోవలసినదేనా! రాజ్యం!'అని.

'అకారణంగా వదలివేయమనలేదే?'

'ఏదో తేలిగ్గా జీర్ణించేది. సరదాగా ఇదో అల్పాహారవిందు. దీనిని నిషేధంచేయకపోతేం లెద్దూ!'

'నేను రోజూ చెప్పడంలేదండీ! ఇది ముదిరిపోయిందని. మానవులను కాఫీటీలు గత ప్రాణులను చేసినవి. ఉత్సాహంగా వుంటుంది. వీటినిగురించి ఆట్టే పీకులాడకు.'

'తాత్కాలిక ఉత్సాహమేగాని దానిఫోర్సు కాస్తా తగ్గిపోయినతరువాత దానికి రెండింతలు నీరసము. పాశ్చాత్యులది మిక్కిలి శీతలదేశమగుటచేత వేడివేడి కాఫీ త్రాగకపోయిన వారి పరిస్థితి బహుదుర్భరముగా నుండును. మనదేశమో వేడిదేశము. మజ్జిగే మన శీతోష్ణపరిస్థితులకు మంచిది.'

'కాఫీ టీ త్రాగుడు కూడదని మద్య నిషేధకచట్టమువలె శాసనముగాని ప్యాసుచేయిస్తారేమిటి మీ స్త్రీలు'అని నవ్వుతూ అడిగాను.

'మా స్త్రీలు అంటే మీకు హేళనగావున్నది. ఉన్నత విద్యాధికులు, వీనివల్ల సాధకబాధకములు తెలిసిన విమర్శకులు, మీరే యీమాత్రం త్యాగంచేయకపోతే ఏమీ తెలియని మూఢులు, విద్యాలేశం తెలియని ఖలులు మద్యం త్రాగుతారంటే ఆశ్చర్యమేమి?'

'ఎంతదెబ్బ తీశావ్!' రాజ్యం! మా విద్యాధికులమీద.

రాజ్యం విరగబడి నవ్వుతూ 'పాశ్చాత్యులనుండి అంటించుకున్న అంటురోగం ఇది మా స్త్రీలే వదలించాలి.' అంది. ప్రేమతో చెంపనిమురుతూ అన్నాను. 'ఇక మానివేస్తానులే' అని.

మాట్లాడుతూ కాళీచేసిన కారపుబూంది ప్లేటు తీసుకుపోతూ నేడు సుదినము. నా సాధనఫలించినదని కాబోలు ఆమె నోటినుండి వెలువడినట్లుగా వినిపించినది.

౨

మా రాజ్యం పల్లెటూరిపిల్ల. ఆమెకు దేశాభిమానంమెండు. ప్రతివాక్కు, ప్రతిచేత దేశభక్తిపూరితమై యుండును. సహజసుందరి. సోమరితనం గిట్టదు. చక్కని సుగుణశీలము, గృహపరికరములు, ఇతర ఖర్చులు, న్యష్టపరచి కుటుంబాభివృద్ధికి పాటుపడుటయందు మా రాజ్యంనుచెప్పి మరియొకరిని చెప్పవలెను.

ఆమెకు ఇదే తొలిసారికాన్పు. నేను నా జీవితంలో విచారం ఎరుగకుండా రాజ్యంతో ప్రణయ రాజ్యంలో విద్యారాజ్యంలో రాజ్యంచేసేవాడికి ఇది పెద్ద ఆఘాతంలా అడ్డు తగిలినది.

నాడు మా మామగారు మా రాజ్యంను పుట్టింటికి తీసికెళ్లుటకు వచ్చినారు. మా తల్లిదండ్రుల అనుమతితో రాజ్యంను ప్రయాణముచేసినాము. వీధిలో జట్కా నిలబడినది. సామానువగయరా మా మామగారు బండిలో సర్దుతుండిరి. మందగమనమున నాతో చెప్పుటకు వచ్చినది. ఆమె ముఖములో మునపటిసంతోషం శూన్యం. పిరికిగా భయముతో బిక్కమొగముతో నా మంచంప్రక్క నిలబడినది.

'ఏం రాజ్యం ప్రయాణమయినదా ?' అని అడిగాను. రాజ్యం సిగ్గుతో తల వంచేసుకుంది.

'మాట్లాడవేమి ? రాజ్యం ?' అని మెలికపడిన లోలకు సవరిస్తూ అడిగాను.

'ఈ విచిత్ర ప్రాసాదపట్టణ విహారవీధులలో మగచిపోక త్వరత్వరగారండి.' అని మెల్లిగా చెప్పినది.

'లేదు రాజ్యం నీవు మరుపుకూడా వచ్చెదవా ?'

'మరల మీ పదపద్మముల సేవచేయు భాగ్యమబ్బునా ?'

'భయపడకు రాజ్యం మీయక్క సుశీల సుఖంగా ప్రసవించలేదూ ?'

గడ్డము పైకెత్తిచూచితిని. ఆమెకళ్లలో నీటిబింధువులు కనబడ్డాయి. నా కంతకుముందే ధైర్యము సడలిపోయినది. నాకు రాజ్యంముఖం చూడగానే కళ్లనుండి నీళ్లువచ్చినవి. నన్నునే నిందించుకుంటూ రాజ్యంను దగ్గరకు తీసుకుని భయములేదని ఊరార్చితిని. కొంతవడికి దైవనిర్ణయము ఎటులనున్నదో అని అస్పష్టముగా పలికినది.

రాజ్యంను రైలుఎక్కించి వారంరోజులలో వస్తానని చెప్పి ఇంటికి వచ్చితిని. ఇల్లు స్మశానవాటికకంటే అన్యాయంగా వున్నది. ఇల్లాలులేని ఇల్లు ఇల్లుకాదని అప్పుడు అనుకున్నాను. నిద్రలోకూడా అదే ధ్యాని.

3

రాజ్యం ఆరోగ్యం ఎప్పటికప్పుడే ఉత్తరములద్వారా తెలుసుకొనేవాడిని. ఆమె నియమ నిగ్రహములు నాకే ఆశ్చర్యం గొల్పేవి. గర్భము నిలిచినప్పటినుండీ బహు తేలికపదార్థములనే భుజించేది. పండ్లు, పాలు ఎక్కువగా వాడేది. బ్రహ్మచర్యదీక్షకూడా వహించినది. గర్భవతులు గమనించవలసిన విధులన్నియు తెలుసుకొనేది. చదివేది.

అది మూడుగంటలవేళ. ఆఫీసుగదిలో పత్రిక చూసుకుంటున్నాను. ఎవరో కృష్ణన్‌గారూ! కృష్ణన్ గారూ! అని పిలచినట్లయినది. అవతలికివెళ్లి చూడగా పోష్టుజవాన్ ఉత్తరము అందించినాడు. పై అడ్రసు చూచే రాజ్యం వ్రాసిందని తెలుసుకొని ఆతురతగా విప్పిచూచితిని. అందిట్లుండెను.

## సువార్త

నేను నిన్న 3 గంటలవేళ సుఖముగా ప్రసవించితిని. ఆడశిశువు గలిగినది. ఆరోగ్యముగానే యున్నాము. మీరు జాగ్రత్తగా నుండుడు. మన అల్లుని కట్నపురూపాయల విషయమై ఆలోచింపుడు. మా నాన్నగారి టరము అయినది. ఇక మీ టరము ప్రారంభమయినది. శ్రద్ధతీసుకొనుడు. మీరు ఒకసారి వచ్చి వెళ్లవలెను.

ఇట్లు,

రాజ్యలక్ష్మి.

ఉత్తరము చదివి ఆనందచకితుడనయితిని. రాజ్యం బ్రతికి బయటబడినది. భగవంతునకు అనేక కృతజ్ఞతాసూచకములైన నమస్కారములు చేసితిని. నా పెండ్లికి కట్నము 3 వేలు ఇచ్చినారు. ఇతర లాంఛనములు వేయిరూప్యములకు పైగా కోపగించే పుచ్చుకున్నాను. దానితోబాటు అత్తవారు బోల్తాకొట్టారు. ఈ విషయాలు రాజ్యం నాతో చెబుతూండేది. కాని నేనంత లక్ష్యపెట్టేవాడిని గాను. దానికి ఎత్తిపొడుపు రాజ్యం కట్నం ప్రోగుచేయుడని పురిట్లోనే వ్రాసింది. ఆ మాటకు నవ్వాపుకోలేక అమాయకంగా నవ్వాను. ఉత్తరం పదేపదే చదువుకున్నాను. ఎన్నిసార్లుచదివినా తృప్తిలేదు.

౪

నేను మా యత్తవారింటికి ప్రయాణమై వెళ్లినాను. వీధిలోనే మా బావమరది మురళి బావా అక్కకి మగపిల్లవాడు పుట్టినాడని కేకలువేశాడు. నాకు ఆశ్చర్యమయినది మురళి కేకలువిని కాబోలు మా అత్తగారు నీళ్లు ఎదురుగుండా తెచ్చి కొడుకుపుట్టాడు బాబు అని మహదానందంతో అంది. రాజ్యం వ్రాసిన ఉత్తరం మాటేమిటని నే తెల్లబోయాను.

మీ మామగారు ఉత్తరం వ్రాస్తుంటే వారించి అమ్మాయే ఓపికతెచ్చుకుని వ్రాసింది. ఏమివ్రాసిందో! ఏమిటో! కోపగించుకోకు నాయనా! అని మా అత్తగారు మెల్లిగా చెప్పింది.

అప్పటికి నీళ్లు అయిపోయినవి. 2, 3 రోజులకు నెలవెళ్లిపోతుంది గాబోలును. రాజ్యం బాలింత ముసుగుతో మోమున చిరునవ్వువెలయ నడుంకట్టు సవరించుకుంటూ సర్వజనవంద్యుడు, భారతవీరుడు మన బేబీ అని నాకందించినది. రాజ్యం వ్రాసినట్లుగా ఆడపిల్లకాదు మగపిల్లవాడు. నే నవ్వాపుకోలేకపోయినాను.

'అంత సంతోషంగావుంది. కట్నపుసంచులు మా వేననా ?'

'లేదు సంస్కర్తవు నీవుండగా మా కెలాగగును.'

'నేను మీ కడ్డువచ్చితినా ? మీబిడ్డ కడ్డగుటకు.'

'అదికాదు. మా యమ్మ నీయంత జ్ఞానవతికాదు. అందుచేతనే మేమిలా తయారయినాము. నీవో విజ్ఞానవతివి. మా యమ్మ తయారుచేసినట్లు తయారుచేసెదవా ?'

రాజ్యం బేబీని ఆనందపారవశ్యంతో ముద్దిడుకుంటూంటే ఇలా అనుకొనేవాడిని ఆ తన్మయతచూచి,

గురుత్రయమున తల్లికే ప్రధానస్థానమొసంగబడినది. అందరిలో నామెయే పరమగురువు. ఆదిగురువు. శిశువు గర్భస్థమైననాటినుండియు భగవానునిచే గురువుగ నిర్ణయింపబడినది. ఆమె యొసగు శిక్షణ ఏ విశ్వవిద్యాలయమును, ఏ గురుకులవాసమును ఒసంగజాలదు. బాలునుయ్యేలలో పరుండబెట్టి యూచును. మృదుమధురస్వరములలో నామె పాడు జోలపాటలలో, ఎత్తిముద్దాడునపుడామె వదనసీమనుండి ప్రవహించు ప్రేమతరంగములలో, మాటలు నేర్పుటలో, చేష్టలు గరపుటలో ఆమె ప్రదర్శించు చాతుర్యమున శిశుపోషణమున ఆమె గనబరచు ఉల్లాసమున ఎంతటి విద్యాశిక్షణమున్నదో వర్ణింప నలవిగాదు. అందువలననే మన ప్రాచీనులు గురుత్రయమున తల్లికి ప్రధానస్థానమొసంగిరి.

మా రాజ్యం ఇప్పుడు కేవలం ప్రేమమయమూర్తిగా మారిపోయినది. ఆహా! మాతృప్రేమ వర్ణింప నలవిగాదు గదా?

బేబీని నావద్దకు తీసుకువచ్చి 'ఏమండీ! ఎవరిపోలికలు ఎక్కువగా వున్నాయి' అని అడిగేది. వాడి బుద్ధిసౌందర్యంమాత్రం గాంధీ జవహరులాలును బోల్చి చెప్పి సంతోషించేది.

భారతనాయకమణే గాకుండా ప్రపంచ నాయకశిరోమణిగా తయారుచేయవలెననే ఆశయముండేది రాజ్యంకు. నిజంగా ఆమె ఇచ్చేవి పాలుకావు. పాలరూపేణ మాతృదేశభక్తి నూరిపోయుచున్నది. ఆమె ముద్దిడుట ముద్దిడుటకాదు. ముద్దిడుటద్వారా ఈశ్వరభక్తి తెల్పుచున్నది. చూపేది వాత్సల్యతకాదు వాత్సల్యత ద్వారా సర్వమానవ సౌభ్రాతృత్వము నిరూపించుచున్నది. బేబీయందు చూపే ఓపిక ఓపిక కాదు. స్వార్థత్యాగము నిరూపించుచున్నది. బేబీకి చెప్పేవి మాటలుకావు. మహాపురుషుల ఆదర్శచరిత్ర బోధించుచున్నది.



బాల్యములో విచక్షణశక్తి తక్కువగానుండి అనుకరణశక్తి ఎక్కువగానుండును. కాబట్టి తన్నుతాను డిసిప్లిన్ చేసుకొనలేని తల్లి తన బిడ్డలను డిసిప్లిన్‌లో పెట్టలేదు. బిడ్డలను సర్వవిధముల చిన్ననాటినుండియు నియమపటిష్టులనుగ జాగరూకులుగ జేయుటకు మాతృవాత్సల్యముతో విధించు డిసిప్లిన్ కాని, కేవలం రెజమెంటేషనువంటి శాసనపూర్వకమైన మిలిటిరిజముకాదు.

నేర్పింపవలసిన విషయములలో బిడ్డలకు సచ్ఛీలము, శౌచము ముఖ్యముగా చెప్పవలెను. శరీరము బట్టలు పరిశుభ్రముగా నుంచుకొనుటయు, నిత్యచర్యలు నియమానుసారముగా చేయుటయు, ఆరోగ్యానందములు గలిగించును. భావిజీవితమునకు ఇవియే పునాదియగును. అని బేబీనిగురించి చెప్పతూ ఇట్టి ఉత్తమ విషయములు ఎన్నో నాతో ఏకరువు పెట్టేది.

అనుభవజ్ఞులైన డాక్టర్ల అభిప్రాయములు ఎక్కువగా తీసుకొనేది. శిశుపోషణనుగూర్చి చదివే పుస్తకములు పత్రికలు లెఖ్ఖలేవు.

మా బేబీ క్రమముగా వాక్యరచన జిలిబిలిగా చేయుచున్నాడు. ఆ భాష నాకేమీ అర్థమయేదికాదు. మా రాజ్యంమాత్రం వాడితో పసిభాషలోనే మాట్లాడేది. నే తెల్లబోయేవాడిని అర్థంకాక.

బేబీ ప్రతివస్తువు పరిశోధన సెపంమీద నానాహంగామా చేసేవాడు.

## ‘ మా గృహిణి ’

అది సాయంసమయము. రాజ్యం పెరట్లోకూర్చుని గృహలక్ష్మి చదువుచున్నది. నేను బేబీని ఎత్తుకుని చల్లగాలికి అటూ ఇటూ తిరుగుతున్నాను. బేబీ ప్రకృతిదృశ్యములు చూచి కేకలువేసి ఆడియాడి పేచీకి ప్రారంభించాడు.

‘ఏం బాబూ!’ అని లాలనచేసి అడిగాను.

‘మాతిపూ! మాతిపూ!’ అని దక్షిణవేపు చూపిస్తూ చంకదిగిపోతున్నాడు. నాకేమీ అర్థంకాలేదు. ఎన్నిసార్లు అడిగినా అదేమాట.

నా తికమకలు చూసి రాజ్యం నవ్వుతూంది.

‘ఏమిటి రాజ్యం!’ అని అడిగాను.

‘మాలతీపూలట. వీడి దృష్టిపథంలోకి మళ్లీ మాలతీపూలు ప్రవేశించాయి. అదిగో దిగిపోతున్నాడు’ అంటూ బేబీని నడిపించుకొని మాలతీపొదవద్దకు తీసుకువెళ్లింది. బేబీ వాడి పసితనపు చపలత మానకుండా మాలతీపొద ధ్వంసంచేసేస్తున్నాడు.

‘అయ్యో! అయ్యో! మాలతీ తీగలు తెంపేస్తున్నాడు. ఇలా తీసుకురా రాజ్యం’ అని ఖంగారుతో అంటున్నాను. రాజ్యంమాత్రం వాడిని ఏమీ అనలేదు. తను వంగి మాలతీ తీగలను వాసనచూడడం ప్రారంభించిది. మా బేబీ ఆంజనేయులువలే ధ్వంసంచేసేవాడల్లా బోయి తానుకూడా వాసనచూడడం ప్రారభించాడు. ప్రతి చెట్టువద్దకు పోయి రాజ్యం ఈవిధంగానే చేసింది. బేబీకూడా చెట్లను అతిసున్నితంగా చుంబనంచేయడం ప్రారంభించాడు. నేచకితుణ్ణయినాను. రాజ్యం సమయానుకూలతకు శిశుపోషణాసక్తికి.

‘బేబీ!’

…………

‘వరేయ్!’

…………

‘నేతిగిన్నె ఎవరు తన్నేశారూ!’

…………

మా బేబీ తల్లికేకలువిని వచ్చి నావళ్లోబడ్డాడు. నేనప్పుడే సంగతంతా గ్రహించాను.

రాజ్యం మావద్దకువచ్చి బేబీని ప్రశ్నించింది. ‘పారబోశావా’ అని.

బేబీ నామెడ గట్టిగా కౌగలించుకున్నాడు.

బేబీని రక్షించదలచి మా బేబీ పారబోయలేదని అబద్ధమాడి భయము తీర్చబోయాను.

రాజ్యం నావంక చురచురచూచి ఒక నవ్వునవ్వింది నా అమాయకత్వానికి. బేబీనిచేరి ‘బాబూ’ అంటూ లాలనచేసి ఎత్తుకుని ‘నేతిగిన్నె ఎవరుతన్నేశారు చెప్పునాన్నా’ అని బుజ్జగించి అడిగింది. వాడిభయం పోలేదు.

'నిజం చెప్పడానికి భయమేమి బాబూ! రాత్రిచెప్పిన కథలో ఆపిల్లవాడు దొంగలకు జేబులోనున్న రూపాయలు అబద్ధమాడకుండా చెప్పలేదు బేబీ!'

వెంటనే మా బేబీ కిలకిలనవ్వుతూ 'నేనే తన్నేశానమ్మా' అని చెప్పినాడు.

బేబీ సత్యం చెప్పినందుకు రాజ్యం సంతోషించి 'సత్యమేచెప్పు బాబూ!' అని బుజ్జగించి ఒక నారింజ తొన బహుమానంగా ఇచ్చి తిరిగి తనపనిలో లీనమయినది.

రాజ్యం సత్యంచెప్పించడంయొక్క చాతుర్యంచూచి నేచకితుణ్ణయినాను. ఇంకొక తల్లయితే బాదేసి వాడి జీవితంలో ఇక ఎన్నడూ సత్యంచెప్పకుండా చేసును అని అప్పుడు అనుకున్నా!

అప్పటినుండీ మా బేబీ ఎంతప్రమాదమైననూ సత్యమేచెబుతాడు. ఒక సత్యమేగాదు వాడు అన్నివిధాలా ఆదర్శప్రాయుడుగానేయున్నాడు.

మా పెరట్లో మొక్కలకన్నిటికీ రాజ్యం బేబీ నీళ్లుపోసేవారు. నౌఖరుపోస్తాడు పిల్లవాణ్ణి ఏంకష్టపెట్టిస్తావు, అని అనేవాడిని. వెంటనే విక్టోరియామహారాణి బిడ్డలయొక్క పెంపకంశిక్షణ ఏకరువుపెట్టేది. ఇప్పటి యువకులు శరీరకష్టమునకు ఇష్టపడకపోవుటచేత సోమరితనం బలిసియున్నది. అందుచేత శరీరపరిశ్రమ నిరాడంబరజీవితము చిన్నప్పటినుండియు బిడ్డలకు నేర్పాలి. పనిచేస్తే తప్పు అనేపంథాలో తయారుచేయగూడదు అని చెప్పేది. బేబీ నియమబద్ధత, సుగుణశీలము, దేశభక్తి నన్ను ముగ్ధుణ్ణిచేసేవి. నిండా అయిదు సంవత్సరములు లేవు.

బేబీ కథలంటే చెవికోసుకుంటాడు. రాజ్యం ఎప్పుడూ సుప్రసిద్ధనాయకులచరిత్రలు చెబుతూండేది. రాజ్యం కథలుచెబుతూంటే నేచిన్నప్పుడు చదివినచరిత్రలో మహారాష్ట్రవీరుడు శివాజీజనని జీజీబాయి జ్ఞాపకంవచ్చేది. గాంధీకథ వాడికి కరతలామలకమే.

మా బేబీని చూచీ చూడ్డంతోడనే ఎవరైనాసరే 'ముందుముందు చాలా అభివృద్ధికి వస్తాడు' అని చెబుతారు.

స్త్రీలు గృహలక్ష్ములు. ఇంటియందు అధికారము, నిరంకుశము, పిల్లలనుపెంచుట, వారికి విద్యాబుద్ధులు గరపుట, ఆహారనిర్మాణము, గృహారామపాలనము, గృహ నవుఖరులమీద యధికారము, కుటుంబమునకు కావలసిన దుస్తులు, నిర్మాణము మొదలగు సమస్తవిషయములు స్త్రీలచేతియందే గలవు. దేశీయభాగ్యోదయమునకు కారణమగు ఖద్దరుధారణము, జాతీయధర్మపరిపాలన, వీరమాతృత్వము స్త్రీలయందు మూర్తీభవింపవలెను. భర్తను, బిడ్డలను సన్మార్గమునబెట్టుటకు స్త్రీలకు శక్తిసామర్థ్యములు గలవు. ఖడ్గతిక్కన యుదంతము మనమెరుంగనిదా? కాదు. యుద్ధమున వెన్నిచ్చి పారివచ్చిన ఖడ్గతిక్కనకు అతని భార్యాతల్లులు స్నానమునకు నీరు పసుపుయుండలునుంచి నులకమంచము అడ్డుపెట్టగా తిక్కన విచారించుచుండ వారలు, 'మగురాడవారమైతిమి. వగపేటికి జలకమాడవచ్చినవేళన్' అని దోనాడి తిరిగి యుద్ధమునకు పురికొల్పిపంప లేదా? దేశభావిభాగ్యోదయము స్త్రీలపై నాధారపడియున్నదనుటకు సందియములేదు.

మా బేబీ అభివృద్ధికి నా దురభ్యాసముల దిద్దుబాటుకి 'మా గృహిణి' చాతుర్యమంటే ఎవరైనా ఆక్షేపణచేస్తారా?